సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 24 । జూన్ । 2025



ఎల్లో రియల్టర్లకు దాసోహం!

ప్రజల ప్రయోజనాల కంటే ఎల్లో రియల్టర్ల ప్రయోజనాలే విద్యుత్ అధికారులకు ఎక్కువయ్యాయి. వెంచర్లకు విద్యుత్ స్తంభాల సరఫరా వ్యవహారమే ఇందుకు నిదర్శనం. -8లో



అంతర్ జిల్లా దొంగ అరెస్టు

ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అందులోని కాపర్ వైర్ దొంగతనం చేసే అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.227
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1570 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

29నుంచి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె సమీపంలోని వేదా పాఠశాలలో ఈనెల 29,30 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆయన వెంట ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీధర్,కోచ్ మహీంద్ర పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



సీఎం చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న కలెక్టర్ శ్రీధర్. పక్కన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి: జిల్లా కలెక్టర్‌చామకూరి శ్రీధర్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ వారు అందించిన సర్టిఫికెట్‌ను సోమవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కలెక్టర్ శ్రీధర్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి అందుకున్నారు.మే 28న జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక గంట యోగా సెషన్‌లో 13,594 మంది హెల్త్ వర్కర్స్‌తో యోగా చేయించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు.

డీఎంహెచ్ఓ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ లక్ష్మీనరసయ్య

రాయచోటి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధి కారిగా డాక్టర్ లక్ష్మీనరసయ్య బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాయచోటిలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లా డీఎంహెచ్ఓగా డీఐఓ డాక్టర్ ఉషశ్రీ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా ఉన్న లక్ష్మీనరసయ్య ఇక్కడకి వచ్చారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మహల్, ఎర్రకోటపల్లి పీహెచ్‌సీలలో వైద్యాధికారిగా, మదనపల్లె జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓగా పనిచేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అందరి సహకారంతో జిల్లాను వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఇండికేటర్లలో మొదటి స్థానంలో ఉండేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన డీఎంహెచ్ఓను కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులు,కార్యాలయ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఇది.. బాబు ద్రోహం



- ఉద్యోగం రాదు..ఉపాధి దొరకదు
- భృతి ఇవ్వకపోవడంతో అల్లాడిపోతున్న నిరుద్యోగులు
- ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చి విస్మరించిన కూటమి సర్కార్
- ప్రభుత్వ వంచనపై గర్జించిన నిరుద్యోగులు, విద్యార్థులు
- రాయచోటిలోని జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట యువత పోరు కార్యక్రమంలో భాగంగా జెండాలు పట్టుకుని నినదిస్తున్న యువకులు, నిరుద్యోగులు

సాక్షి రాయచోటి/రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణిపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. ఎన్నికలకు ముందు ఏవేవో చెప్పి...అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడంపై నిరుద్యోగ లోకం కన్నెర్ర చేసింది. ఫీజులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఎదురవుతున్న సమస్యలపై విద్యార్థిలోకం గళమెత్తింది.జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల సీట్ల విషయంలో సర్కార్ తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థులకు సంకటంగా మారింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలతో భయపెడుతున్న వైనంపై జనం తిరగబడుతున్నారు. కొత్తగా ఉద్యోగాలు లేకపోగా...పరిశ్రమలు నోరెళ్లబెడుతున్న పరిస్థితులను వివరిస్తూ..ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతుండటంపై కన్నెర్ర చేశారు. భృతి లేదు...ఉపాధి లేదు...బతుకెలా అంటూ బిగ్గరగా నినాదాలు చేస్తూ కదం తొక్కారు. వైఎస్ జగన్ నాయకత్వం వర్ధిల్లాలి.. నిరుద్యోగ, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు సోమవారం యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లా కేంద్రమైన రాయచోటిలో యువత పోరు నిర్వహించి ప్రభుత్వానికి వారి వేదనను వినిపించారు.

కలెక్టరేట్‌కు కదం తొక్కిన యువత

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న జాతీయ రహదారి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరిప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిశోర్‌దాస్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రధర్, రాష్ట్ర మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హరూన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మమత తదితరుల ఆధ్వర్యంలో శ్రేణులు కదం తొక్కారు. వైఎస్సార్ సీపీకి సంబంధించిన పలు అనుబంధ విభాగాల నాయకులతోపాటు నిరుద్యోగులు, విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు కదిలి వచ్చారు. నిరుద్యోగ భృతి వెంటనే అందించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ సంపూర్ణంగా అమలు చేయాలని, మెడికల్ కళాశాల సీట్లను పునరుద్ధరించాలని ఫ్ల కార్డులు చేతబూని నినాదాలతో హోరెత్తించారు. జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్ మెయిన్ గేటు మీదుగా దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ యువత అడుగులో అడుగేసింది. వలంటీర్లు, బేవరేజ్‌లో ఉద్యోగులు, ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు, ఏపీఎండీసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ వర్కర్లలో అనేకమందిని సర్కార్ తొలగించడంపై కూడా నిరసన వ్యక్తంచేశారు.

నియంతృత్వ పోకడలు మారాలి...డీఆర్వోకు వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన సంఘాల నేతలు కలెక్టరేట్‌లో ఉన్న డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే దిగి వచ్చి డిమాండ్ నెరవేర్చాలని కోరారు. కూటమి సర్కార్ నియంతృత్వ పోకడలు వదలి, నిరుద్యోగులు, విద్యార్థులు, యువత సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మదనపల్లె యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి, గాలివీడు మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్, రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, బీసీ సెల్‌రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్, రాయచోటి, రాజంపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు రెడ్డిబాబు, ఓబుల్‌రెడ్డి, రాయచోటి, రాజంపేట, పీలేరు విద్యార్థి విభాగం అధ్యక్షులు మణికంఠరెడ్డి, అబ్దుల్లాఖాన్, లోకనాథం, యువజన విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు భువనేశ్వర్‌రెడ్డి, షబ్బీర్‌బాష, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊసే లేని ఫీజు రీయింబర్స్‌మెంట్



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయలేదు.విద్యాదీవెన,వసతి దీవెన నిధుల కోసం విద్యార్థులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు.గత వైఎస్సార్ సీపీ పాలనలో త్రైమాసికం ముగిసిన వెంటనే పూర్తి ఫీజు రీఎంబర్స్ మెంట్ మంజూరు చేసేవారు.కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విద్యార్థులు అప్పులు చేసుకుని చదువుకుంటున్నారు.

– జంగంరెడ్డి కిషోర్ దాస్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు

యువతను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే



నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదు సరికదా ఉన్న ఉద్యోగాలు ఊడపీకుతూ నిరుద్యోగులను నిలువునా ముంచారు. అధికారంలోకి వస్తే నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. ఈ కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంగా విద్యార్థులను, యువతను మోసం చేస్తున్న వైనాన్ని నిలదీస్తున్నాం. తక్షణమే కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి.

– శివప్రసాద్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు

నిరుద్యోగుల ప్రస్తావనే లేదు



ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా నిరుద్యోగుల ప్రస్తావన లేదు. నిరుద్యోగ భృతి హామీ అయితే ఇచ్చారు గానీ అమలుపై ఆసక్తి చూపడంలేదు. అసలు నిరుద్యోగభృతి అమలు చేసే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఉందా? లేకుంటే ఎప్పటిలానే యూటర్న్ తీసుకుంటారా? అర్థం కావడంలేదు.

–హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్

ఢిల్లీలో కీర్తి ప్రతిష్టలు చాటిన తంబళ్లపల్లె విద్యార్థిని

రాష్ట్రపతి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేత



రాష్ట్రపతి దౌప్రది ముర్ము చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న తేజస్విని

తంబళ్లపల్లె: రాజకీయరంగంలో టీఎన్ విశ్వనాథరెడ్డి 1962లో రాజంపేట ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికై అప్పటి ప్రధాని జవహలాల్ నెహ్రూ చేతుల మీదుగా పార్లమెంట్ భవనంలో సత్కారాలు అందుకుని తంబళ్లపల్లె పేరు ప్రతిష్టలను చాటారు. నేడు విద్యారంగంలో మరో మారు పల్లెటూరి విద్యార్థిని తేజస్విని సీఎం ఏలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించి భారత రాష్ట్రపతి దౌప్రది ముర్ము చేతుల మీదుగా సర్టిఫికెట్, మెడల్స్ అందుకుని తంబళ్లపల్లె పేరు నిలిపింది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురామిరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజస్విని చిన్నతనం నుంచి చదువులో ప్రతిభ చాటుతూ జూన్ 2024 విడుదలైన సీఎంఏ పరీక్షల్లో ఆలిండియా మొదటి స్థానంలో నిలిచింది. వ్యవసాయ కుటుంబంలో పుట్టి రోజువారి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి పట్టుదలతో చదివింది.అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంది. సీఏ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియాలో 14 ర్యాంకు దక్కించుకోవడం గమనార్హం.

27న జాబ్‌మేళా

రాయచోటి టౌన్: మదనపల్లె చిత్తూరు రోడ్డులోని విశ్వహిత డిగ్రీ కళాశాలలో ఈ నెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విశ్వహిత డిగ్రీ కళాశాల వారు డీఆర్‌వో మధుసూధన్ రావు చేతుమీదుగా ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో ఏయూ స్మాల్ ఫైన్ బ్యాంక్, మెట్రో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ, హీరో మోటో క్రాప్, ముథూట్ ఫైనాన్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయని నాగార్జున తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు https:// naipunyam.ap.gov.in /user& registration ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.ఇతర వివరాలకు 6301612761/9553202509/ 974143 2931/ 8897 776368 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

25న వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా

జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యం



రాయచోటి: వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఈనెల 25వ తేదీన వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం ప్రకటించారు. సోమవారం ఈ విషయాన్ని రాయచోటిలో విలేకరులకు వెల్లడించారు. రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుగవాసి సుబ్రమణ్యం 20 రోజుల కిందట టీడీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. 2024 ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఈయన పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా మీడియాతో సుబ్రమణ్యం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిక విషయం ఈ రోజు తీసుకున్న నిర్ణయం కాదన్నారు. గత పది సంవత్సరాలుగా ఎన్నో సందర్భాల్లో తన తండ్రితో చర్చించడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం తన తండ్రిబాటలో నడిచి, భవిష్యత్తులో వారి సేవా భావానికి అనుగుణంగా తాను వేసే ప్రతి అడుగు ఉంటుందన్నారు. పార్టీలో చేరడానికి గల కారణాలు, జరిగిన పర్యావసనాలన్నీ ప్రతి ఒక్కరిని నేరుగా కలిసి వివరిస్తానని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కార్యకర్తలను, నాయకులను ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదని భావించానన్నారు. అందువల్లనే తాను ఒక్కన్నే వెళ్లి పార్టీలో చేరిన అనంతరం ప్రతి ఒక్కరినీ నేరుగా కలుసుకొని అంతా వివరిస్తానని ఉద్ఘాటించారు.

ఆమోదం లేదు.. జీతాలు లేవు!

- మదనపల్లె మున్సిపాలిటీలో 80 మంది పారిశుధ్య కార్మికుల వ్యవహారం..
- లేఖలపై ఆమోదం తెలపని ప్రభుత్వం
- వేతనాల మంజూరుకు బిల్లులు పంపిన అధికారులు
- కొత్త ప్రీ ఆడిట్ నిర్ణయంపైనే ఆశలు



మదనపల్లె పట్టణం

మదనపల్లె: సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన మదనపల్లెలో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం అధికారులు నియమించుకున్న 80 మంది దినసరి పారిశుధ్య కార్మికుల నియామకం ప్రభుత్వ ఆమోదం మేరకు జరగలేదని స్పష్టం అవుతోంది. కోవిడ్-19 కోసం గత ప్రభుత్వం కార్మికులను నియమించుకునేందుకు అనుమతి ఇచ్చి తర్వాత ఆ వ్యవస్థను ఆపేసింది. అయితే 2024 జూలైలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఓ మెమో ఆధారంగా మున్సిపాలిటీల్లో దినసరి పారిశుధ్య కార్మికులను నియమించుకోగా చాలా చోట్ల ప్రభుత్వం నుంచి నియామక అనుమతులు ఉన్నాయా లేవా అన్న పరిశీలన లేకనే వేతనాలు మంజూరు చేస్తున్నారన్న అంశం చర్చనీయాంశమైంది. అయితే మదనపల్లె మున్సిపాలిటీకి సంబంధించి ప్రీ ఆడిట్‌లో ఈ విషయాన్ని పసిగట్టడంతో ఏ మున్సిపాలిటీలోనూ జరగని విధంగా వేతనాలకు బ్రేక్ పడింది. మిగతా మున్సిపాలిటీల్లో వేతనాలు ఇస్తున్నప్పుడు మదనపల్లెకు ఎందుకు చెల్లించరు అన్న వాదన ఉన్నప్పటికి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కార్మికులను తొలించిన విషయాన్ని ఉదహరిస్తున్నారు.

మెమో ఆధారంగా నియామకం

మదనపల్లె మున్సిపాలిటీలో 80 మంది పారిశుధ్య దినసరి కార్మికులను ప్రభుత్వం జారీ చేసిన మెమో ఆధారంగా అధికారులు నియమించుకొన్నట్టు తెలుస్తోంది. మెమోలో మూడు అంశాలను సూచించారు. సంస్థల ద్వారా కార్మికులను నియమించుకోవడం, వారికి రూ15వేల వేతనం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించడం, పారిశుధ్య పనులను కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించి యాంత్రీకరణ చర్యలు తీసుకోవడం. దీంతో కార్మికులను నియమించుకునే వెసులుబాటు మెమోలో ఉన్నప్పటికి తర్వాత ఈ మెమోపై మున్సిపల్‌శాఖ నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదని అభ్యంతరం. ప్రభుత్వం నుంచి డీఎంఏకి ఈ మెమో జారీ అయ్యింది కాని డీఎంఏ నుంచి ఎలాంటి ఉత్తర్వు లేదన్నది ప్రీ ఆడిట్ వాదన. ఈ విషయం పక్కన పెడితే పారిశుధ్య కార్మికులను నియమించుకున్నాక ప్రభుత్వ ఆమోదం కూడా పొందలేదు. దీంతో కార్మికుల నియామకం, వేతనాల చెల్లింపు సాధ్యపడదని ప్రీ ఆడిట్ లేవనెత్తిన ప్రశ్నలు.

లేఖలకు లభించని ఆమోదం

దినసరి పారిశుధ్య కార్మికుల వేతనాల చెల్లింపునకు 2024 డిసెంబర్ వరకు ప్రీ ఆడిట్ అభ్యంతరాలు లేవు. అంతకుముందు వేతనాల కోసం పంపిన బిల్లులు పంపినట్టుగా మంజూరవుతూ వచ్చాయి. తర్వాత అభ్యంతరం వ్యక్తం కావడం, నియామక అనుమతుల విషయంపై ప్రీ ఆడిట్ కోరడంతో సమస్య వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా వేతనాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ పరిస్థితుల్లో నియమించుకున్న పారిశుధ్య కార్మికులకు ఆమోదం తెలపాలని కోరుతూ మున్సిపల్ అధికారులు ఒకటికి మూడుసార్లు ప్రభుత్వానికి లేఖలు రాశారు. ఈ లేఖలపై ఇప్పటికి స్పందన లేదని తెలిసింది.

- ప్రీ ఆడిట్ నాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో హిమేష్ నియమితులయ్యారు. దీంతో అందరూ ఆయన నిర్ణయం కోసం ఆశలు పెట్టుకున్నారు. తాజాగా మదనపల్లె మున్సిపాలిటి దినసరి పారిశుధ్య కార్మికులకు వేతనం మంజూరు చేయాలని అధికారులు బిల్లులు పెట్టారని సమాచారం. కొత్త ప్రీ ఆడిట్ వేతనాల మంజూరుకు మిగిలిన మున్సిపాలిటీల పద్ధతిని పరిగణలోకి తీసుకుని ఆమోదం తెలుపుతారా లేదా అన్నది ఉత్కంఠ నెలకొంది.

శ్రీకాళహస్తి తరహా నిర్ణయమే పరిష్కారం

రాష్ట్రమంతా దినసరి పారిశుధ్య కార్మికులను నియమించుకున్నారు..మేం కూడా నియమించామని మదనపల్లె మున్సిపల్ కమిషనర్ చెబుతుండగా..తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి మున్సిపాలిటి అంశాన్ని ఆడిట్ వర్గాలు తెరపైకి తెస్తున్నారు. కోవిడ్-19 కోసం నియమించుకున్న కార్మికులను కొనసాగిస్తుండగా గత ఏడాది నవంబర్‌లో ప్రీ ఆడిట్‌లో వారి నియామకంపై సందేహాలు వ్యక్తం చేస్తూ 25 మంది కార్మికుల వేతనాలను నిలిపివేశారు. తర్వాత మున్సిపల్ కమిషనర్..కార్మికులు పనిచేసిన కాలానికి వేతనాలు మంజూరు చేయాలని, దీనిపై వ్యక్తమయ్యే ఏ అభ్యంతరానికైనా బాధ్యత వహిస్తామని కమిషనర్ ఇచ్చిన లేఖతో వేతనాలు మంజూరు చేయగా..తర్వాత కార్మికులను విధుల నుంచి తొలగించారు. ఇప్పుడు మదనపల్లె విషయంలోనూ శ్రీకాళహస్తి తరహాలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న మదనపల్లె కార్మికులకు వేతనాలు చెల్లించాక..వారి విధులపై తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం కమిషనర్‌కు కల్పిస్తే రెండువైపులా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. లేదంటే కార్మికులకు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది.

ఆమోదంతోనే నియామకం

ప్రభుత్వ ఉత్తర్వు మేరకే పారిశుధ్య కార్మికులను నియమించుకుని పనులు చేయిస్తున్నాం. వారికి నెలవేతనం రూ.15వేలు చెల్లించే అంశం ప్రభుత్వ మెమోలోనే ఉంది. దీనికి మున్సిపల్ కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. అయితే ప్రీ ఆడిట్‌లో అభ్యంతరం పెట్టి వేతనాలు నిలిపివేశారు. నియామకం అంతా నిబంధనల ప్రకారమే జరిగింది. పనులు చేసిన పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం.

–ప్రమీల, మదనపల్లె కమీషనర్

సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ధర్నా

రాయచోటి: అంగన్వాడీలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాయచోటిలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్ వాడీ ఉద్యోగులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు.ధర్నా అనంతరం కలెక్టరేట్ డీఆర్ఓ మధుసూదన్ రావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ, కార్యదర్శి రాజేశ్వరీ, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మీలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా అంగన్‌వాడీల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ముఖ్యంగా సమ్మె కాలపు హామీలు అమలు చేయలేదన్నారు. తక్కువ వేతనంతో జీవనం సాగిస్తున్న వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేసి పనిభారం తగ్గించాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

హామీలు తప్ప అమలు లేదు..

ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ వర్కర్లకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్-2047 పేరుతో ఆంధ్ర ప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తానని చెబుతున్న మాటలు బూటకంగా మారాయన్నారు. అంగన్ వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.లక్కిరెడ్డిపల్లి డివిజన్ పరిధిలో సిబ్బందికి జీతాలు రాలేదన్నారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ రామాంజులు మాట్లాడుతూ గ్రాట్యుటీ అమలు,కనీస వేతనం రూ. 26 వేల కోసం జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఆర్ఓ సమక్షంలో పీడితో జరిగిన సమీక్షా సమావేశంలో అంగన్ వాడీ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుకుమారి, మధురవాణి, ఈశ్వరమ్మ, విజయ, భూకైలేశ్వరీ, ఓబుళమ్మ, కుమారి, చంద్రావతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కృత్రిమ కాళ్లకు పేరు నమోదు చేసుకోండి

రాజంపేట టౌన్: ఉచిత కృత్రిమ కాళ్లు అవసరమైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని చేతన ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ 10 గంటల నుంచి రాజంపేట పట్టణం ఆర్ఎస్ రోడ్డులో ఉన్న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే క్యాంప్ సందర్భంగా కృత్రిమ కాలుకు సంబంధించి కొలతలను తీసుకోనున్నట్లు తెలిపారు. పది రోజుల తరువాత ఆధునికమైన వెయిట్‌లెస్ కృత్రిమ కాళ్లను ఉచితంగా అమర్చనున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కృత్రిమ కాలు అవసరమైన వారు 9014110325, 9966475742 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

అనారోగ్యం భరించలేక ఆత్మహత్య



గోవిందాచారి మృతదేహం

గాలివీడు : అనారోగ్యంతో మనస్తాపం చెందిన కలపల గోవిందాచారి(59) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు కొర్లకుంట గ్రామం కుమ్మరపల్లెకు చెందిన గోవిందాచారి కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో ఈనెల 19 వ తేదీన విష ద్రావణం తాగాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఎక్కుతుండగా బంగారు నగలు చోరీ

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి 6 తులాల బంగారు చోరీ జరిగినట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు. కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ప్రవల్లిక తన భర్తతో కలసి స్వగ్రామమైన పెద్దముడియం మండలం జంగాలపల్లె గ్రామానికి వెళ్లేందుకు జమ్మలమడుగు బస్టాండ్‌కు వచ్చింది. కొద్ది సేపటికి బస్సు రావడంతో హ్యాండ్ బ్యాగ్ తీసుకుని భర్తతో కలసి బస్సు ఎక్కింది. కాసేపటి తర్వాత బ్యాగ్ చూసుకోగా అందులో బంగారు నగలు ఉన్న చిన్న బ్యాగ్ కనిపించలేదు. వెంటనే భర్తతో కలసి జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

ఎల్లో రియల్టర్లకు కరెంటోళ్లు దాసోహం!

- వెంచర్‌కు ఏపీఎస్పీడీసీఎల్ స్తంభాలు సరఫరా
- స్తంభాలపై ఆనవాళ్లు లేకుండా చేసిన వైనం
- ఆరా తీస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం



రాజంపేట-రాయచోటి రోడ్డులోని బ్రాహ్మణపల్లె సమీపంలోని జగనన్నకాలనీ ఎదురుగా వెంచర్

రాజంపేట : రైతులు, వినియోగదారుల ప్రయోజనాల కంటే ఎల్లో రియల్టర్ల ప్రయోజనాలే విద్యుత్ అధికారులకు ఎక్కువయ్యాయి. వెంచర్లకు విద్యుత్ స్తంభాల సరఫరా వ్యవహారమే ఇందుకు నిదర్శనం. రాజంపేట-రాయచోటి రోడ్డులోని జగనన్నకాలనీకి ఎదురుగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ స్తంభాలు వేసుకున్నారని ఆరోపణలు ఆ శాఖను రోడ్డుపైకి తీసుకొచ్చాయి. కరెంటు స్తంభాలపై ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ గుర్తులు చెరిపివేశారు. లేఔట్‌కు కరెంటు పోల్స్ తరలింపు వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. కరెంటు స్తంభాల కోసం రైతులు, ప్రజలు కరెంటోళ్ల చుట్టూ తిరుగుతున్న పరిస్థితులు అనేకం ఉన్నాయి.

దొడ్డిదారిన కరెంట్ పోల్స్ తరలింపు ఇలా..

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఉద్ద ఉన్న తాళ్లపాక సబ్ సెంటర్‌కు ఈనెల 17న 9 మీటర్ల విద్యుత్ స్తంభాలు, 11 మీటర్ల విద్యుత్ స్తంభాలు 26 వచ్చాయి. ఈనెల 6న నార్త్ ఏఈ శ్రీనివాసులు చెప్పారని 9 మీటర్లకు సంబంధించి 8 కరెంటు పోల్స్‌ను కాంట్రాక్టర్ రవి, జె.వెంకటసుబ్బయ్య తీసుకెళ్లినట్లుగా రిజిస్టర్‌లో నమోదు అయింది. ఈ విషయాన్ని ఏఈ ధ్రువీకరిస్తున్నారు.

రూరల్ ఏఈ వద్దకు రియల్టర్లు..

రూరల్ ఏఈ ఈశ్వరరాజు వద్దకు ముందుగా లేఔట్ దారులు (టీడీపీ నేతలు) వచ్చారు. కరెంట్‌పోల్స్ కావాలని అడిగారు. లేఔట్ అప్రూవల్ ఉంటేనే కరెంటు స్తంభాలకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ఆ తర్వాత ఆ నేతలు ఏఈని సంప్రదించలేదు. ఈ విషయంపై ఏఈ మాట్లాడుతూ వెంచర్‌లో తమ శాఖకు సంబంధించిన కరెంటు స్తంభాలు ఉన్నట్లుగా గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంచర్ ఉన్న స్థలం మౌలా పేరుతో ఉందన్నారు. అయితే పేరు వేరొకరిదైనా, వెంచర్ వేసున్నది టీడీపీ నేతలేనని తెలుస్తోంది.

ఉన్నతాధికారి ఒకరికి చేయితడిపారంటా..

ఎల్లో రియల్టర్ వెంచర్‌లో కరెంటు స్తంభాలు తరలింపు వెనుక ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారి ఒకరికి చేయి తడిపారనే ఆరోపణలు ఉన్నాయి. అడ్డు చెబుతాడనే కారణంతో కరెంటు స్తంభాల తరలింపు వ్యవహారం కోసం మరో డివిజన్ స్థాయి ఉన్నతాధికారిని శిక్షణ పేరుతో వారం రోజుల పాటు రాయచోటికి పంపినట్లు తెలిసింది. ఈ వారంలోపు 14 కరెంటు స్తంభాలు వెంచర్‌లో ఏర్పాటు చేసుకున్నారు. స్తంభాలపై ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ పేర్లు, సీరియల్ నెంబర్లు చెరిపివేశారు.

విజిలెన్స్ అధికారుల విచారణ..


బ్రాహ్మణపల్లె సమీపంలో టీడీపీ నేతలు వేసుకున్న వెంచర్‌లో స్తంభాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ స్తంభాలు ఎక్కడి నుంచి వచ్చాయి?ఎవరు తీసుకొచ్చారు, ఎవరు ఈ విద్యుత్ స్తంభాలను నాటారన్న కోణంలో ఆరా తీసినట్లు తెలిసింది. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదికలు వెళ్లనున్నాయి. టీడీపీ నేతల తీరుపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందడంతో కరెంటు స్తంభాల తరలింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



వెంచర్‌లో ఉన్న స్తంభాలపై ఏపీఎస్పీడీసీఎల్ ఆనవాళ్లు లేకుండా చేసిన దృశ్యం

అంగన్వాడీ కేంద్రంలో రసం పొడిలో పురుగులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : లక్కిరెడ్డిపల్లె మండలంలోని దిన్నెపాడు వడ్డెపల్లె అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పురుగులు పట్టిన రసం పొడిని వాడుతున్నట్లు తల్లిదండ్రులు గమనించారు. అంగన్వాడీ కార్యకర్తను ప్రశ్నించగా మీకు దిక్కున్నచోట చెప్పుకోండంటూ ఎదురు దాడికి దిగినట్లు వారు వాపోయారు. పురుగులు పట్టిన రసంపొడిని రసంలోకి వాడి తమ పిల్లలకు పెట్టవద్దు అని ఎంత ప్రాధేయపడినా ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



దిన్నెపాడు వడ్డెపల్లె అంగన్వాడీ కేంద్రంలో పురుగులు పట్టిన రసం పొడి

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ రాయచోటి నియోజక వర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ నీవా కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు, శ్రీనివాస రిజర్వాయర్, ఝరికోన కాలువ పనులు పూర్తి చేసి రైతులకు తాగునీరు, సాగునీరు అందించాలని కోరారు. పీలేరు కార్యదర్శి వెంకటేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి జగన్ బాబు, రైతు సంఘం నియోజక వర్గం అధ్యక్షుడు హరినాథ నాయుడు, అంజాద్ అలీఖాన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గాయపడిన వ్యక్తి మృతి



వెంకట్రమణ (ఫైల్)

కలకడ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ కలకడ మాదిగపల్లెకు చెందిన వెంకట్రమణ(70) తన ద్విచక్రవాహనం లో 17వతేదీన కలకడనుంచి స్వగ్రామానికి చేరుకుంటున్న చేరుకుంటున్న సమయంలో కలకడ జగనన్న కాలనీ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో రక్తగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకట్రమణను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మృతుని చిన్న భార్య రెడ్డెమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె రూరల్ : ఆటో కోసం వేచి చూస్తున్న మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీచేసిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. బీటీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన నరసింహారెడ్డి భార్య సత్య (65) పట్టణంలోని సొసైటీకాలనీలో నివసిస్తోంది. సోమవారం వ్యక్తిగత అవసరాల నిమిత్తం షాపింగ్‌కు వెళ్లేందుకు స్థానిక రామాలయం వద్దకు వచ్చి ఆటో కోసం వేచి చూస్తుండగా, ద్విచక్రవాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని క్షణాల్లో పరారయ్యాడు. ఆమె తేరుకునేలోపు కనిపించకుండా పోయాడు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బంగారు గొలుసు చోరీపై ఫిర్యాదు చేసింది. గొలుసు 32 గ్రాముల బరువు కలిగి సుమారు రూ.2లక్షలు విలువ ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎరీషావలీ తెలిపారు.

బస్సు ఎక్కుతుండగా చోరీ

ముద్దనూరు : స్థానిక 4 రోడ్ల కూడలిలో ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి సొమ్ము చోరీ జరిగింది. ముద్దనూరుకు చెందిన మహిళ సోమవారం ఓ బేకరి వద్ద కడప బైపాస్ రైడర్ బస్సు ఎక్కుతుండగా ఆమె భుజానికి తగిలించుకున్న హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న రూ.1300 నగదును చోరీ చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో ఆ మహిళ దానిని గుర్తించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన వెంకటరమణ

రామసముద్రం : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం రామసముద్రం మండలంలో జరిగింది. ఎలవానెల్లూరు పంచాయతీ కొత్తూరుకు చెందిన మేకల వెంకటరమణ (45) కర్ణాటకలోని సోమయాజులపల్లెకు వెళ్లి వస్తుండగా, కర్నాటక సరిహద్దులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వెంకటరమణ తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గాయపడిన వ్యక్తిని శ్రీనివాసపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

తండ్రి కోసం తపించి తనయుడి మృతి



శివసాయి(ఫైల్)



రామకృష్ణయ్య

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎర్రకొండు శివసాయి(25) కువైట్‌లో ఉన్న తన తండ్రి రాక కోసం పరితపించి అనారోగ్యానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఎర్రకొండు రామకృష్ణయ్య జీవనోపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లాడు. అక్కడ ఎడారిలో పనిచేసేవాడు. రామకృష్ణయ్య పనిచేస్తున్న సేఠ్ తన పాస్‌పోర్ట్ తీసుకుని తనతో పనిచేయించుకుంటూ పదేళ్లుగా జీతం ఇవ్వడం లేదని, ఇంటికి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఒక వీడియోను ఇటీవల ఇంటికి పంపించాడు. ఆ వీడియోను చూసిన శివసాయి మరింత కుంగిపోయాడు. ఈ బెంగతో ఆదివారం రాత్రి కన్నుమూశాడు. దీంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఇప్పటికైనా రామకృష్ణయ్యను ఇండియాకు పంపించాలని భార్య, పిల్లలు కోరుకుంటున్నారు.

అంతర్ జిల్లా కాపర్ వైర్ల దొంగ అరెస్టు



కాపర్‌వైరు దొంగ అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి అందులోని కాపర్ వైర్ దొంగతనం చేసే అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి, రూ.11లక్షల 42వేల 600 విలువ కలిగిన 626 కిలోల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యసాయిజిల్లా ఓబులదేవునిచెరువు మండలం అల్లాపల్లి పంచాయతీ బురుజుపల్లెకు చెందిన గంగిరెడ్డి కుమారుడు కోటిరెడ్డి రామకృష్ణారెడ్డి(48) తన పక్క గ్రామమైన పగడాలవారిపల్లెకు చెందిన వెంకటేష్‌తో కలిసి అన్నమయ్య, సత్యసాయిజిల్లాలోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో కాపర్ వైర్ల చోరీకి పాల్పడ్డారన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో వీరిపై 40 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌వైర్ల దొంగతనాలకు సంబంధించి 28 కేసులు నమోదయ్యాయన్నారు. అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట మండలంలో 14, మదనపల్లె 1, పీటీఎం 1, ములకలచెరువు 7, గాలివీడు 3, కురబలకోట 1, పుల్లంపేట 2, నందలూరు 1, పీలేరు 2, సత్యసాయిజిల్లా నల్లచెరువు 1, గాండ్లపెంట 2 తలుపుల మండలం 3, తనకల్లులో 1 మొత్తం 40 ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్ వైర్ చోరీ చేసినట్లుగా కేసులు నమోదయ్యాయన్నారు. కేసుల విచారణలో భాగంగా జిల్లాకు చెందిన క్రైమ్ సీఐ చంద్రశేఖర్, బి.కొత్తకోట సీఐ జీవన్ గంగానాథ్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేశామన్నారు. సోమవారం నిందితుల్లో ఒకడైన రామకృష్ణారెడ్డి...బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామం కంబళ్లపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, చేతిలో ప్లాస్టిక్ సంచితో వస్తూ, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీలకు సంబంధించిన వివరాలను తెలుపుతూ నేరం అంగీకరించాడన్నారు. నిందితుడు తెలిపిన సమాచారం మేరకు బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామం రంగసముద్రం ఏరు వద్ద గల చెట్టు పొదల్లో దాచి ఉంచిన 626 కిలోల కాపర్ వైండింగ్ వైరును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నిందితుడైన వెంకటేష్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుళ్లు పి.నరసింహులు, శంకర, కానిస్టేబుళ్లు రాఘవరెడ్డి, శివ, శంకర, దొరబాబు, చలపతి, హోంగార్డు సుబ్బయ్యలను అభినందించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

రాయచోటి జగదాంబసెంటర్ : ఏళ్ల తరబడి పనిచేసినా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీవితాలలో మార్పు లేదని కూటమి ప్రభుత్వం స్పందించి జీఓ 36 అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని లేదా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఓ మధుసూదనరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ సెక్షన్ అధ్యక్షుడు అక్బర్, ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మీ, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు

జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదని పోలీసు యంత్రాంగాన్ని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి ఆదేశించారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో అదనపు ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న డీఆర్ఓ మధుసూదన్‌రావు

రాయచోటి : ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని డీఆర్ఓ మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో డీఆర్ఓ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని డీఆర్ఓ తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. అధికారులు ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యుఎస్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 5ను రద్దు చేయాలని సచివాలయ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

రాయచోటి : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్ కోసం విడుదల చేసిన జీఓ నంబర్ 5ను రద్దు చేయాలంటూ సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో భోజన విరామ సమయంలో నిరసన తెలియజేసి అనంతరం డీఆర్ఓ మధుసూదన్ రావుకు వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామవార్డు, సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుడి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓల వలన సచివాలయ ఉద్యోగులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ జీఓను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. సొంత మండలం, మున్సిపాల్టీలలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని, రేషనలైజేషన్ ప్రక్రియ చేసిన తరువాతనే బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఏపీఎన్జీఓ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు హరి ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, జీనత్, వేణు, యుగంధర్, అధిక సంఖ్యలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగను అరెస్ట్ చేసిన కర్ణాటక పోలీసులు



ద్విచక్రవాహనాలను కర్ణాటకకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె రూరల్ : ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడిన దొంగను సోమవారం మదనపల్లెలో కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేసి, 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కర్ణాటకకు తరలించారు. పట్టణానికి చెందిన హేమంత్(24) బెంగళూరులోని హెచ్ఏఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాలు చోరీచేసి మదనపల్లెలో తలదాచుకున్నాడు. ద్విచక్రవాహనాల చోరీపై కేసుల విచారణలో భాగంగా కర్ణాటక పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడు మదనపల్లెలో ఉన్నట్లు నిర్ధారించుకుని సోమవారం హెచ్ఏఎల్ స్టేషన్ ఎస్ఐ దామయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వచ్చి నిందితుడు హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీ చేసిన వాహనాలు మదనపల్లెలో 10, చౌడేపల్లె మండలం బోయకొండ వద్ద 15 దాచి పెట్టినట్లు చెప్పడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి లారీలో ఎక్కించి నిందితుడితో పాటు కర్ణాటకకు తరలించారు.

కూటమి పాలనలో ఒరిగింది శూన్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ, కాంగ్రెస్, బహుజనసేన నాయకులు

మదనపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని, జిల్లాలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్, బహుజనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ మదనపల్లె పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన చిప్పిలి, గుంటివారిపల్లె సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు మొరవ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, రూ.15 కోట్లు కేటాయిస్తే పనులు పూర్తవుతాయన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో టమాటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పితే రైతాంగానికి కనీసం గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా గోదావరి నది బనకచర్ల నుంచి నీళ్లు తెస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కడప నుంచి మదనపల్లె మీదుగా బెంగళూరుకు రైల్వే లైను నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్, బహుజనసేన శ్రీచందు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణప్ప, మనోహర్ రెడ్డి, సాంబశివ, మురళీ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎస్.కే.బాషా, మహమ్మద్ షరీఫ్, ఖాదర్‌బాషా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.